క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో శనివారం షష్టి సందర్భంగా అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

ఆత్మకూరు: నంద్యాల పట్టణంలో తొలిసారిగా ఈ నెల 31వ తేదీన నిర్వహిస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నంద్యాల జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన శ్రీశైలం నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు, నిరుపేదలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, అటవీ ప్రాంతాల్లో గిరిజనుల సమస్యలు మహాసభల్లో చర్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటి సభ్యులు ప్రతాప్, వెంకటశివుడు, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నందికొట్కూరు రూరల్ : బిజినవేముల గ్రామానికి చెందిన చాకలి మధు అనే వ్యక్తి శుక్రవారం పగిడ్యాల మండలంలోని నెహ్రూనగర్ వద్ద కేసీ కాలువలో ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బిజినవేముల గ్రామ సర్పంచ్ రవియాదవ్ మృతుని కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో డెంగీ నివారణ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి :ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించి డెంగీని నివారిద్దామని డాక్టర్లు జబ్బీర్ బాషా, సౌజన్య పిలుపునిచ్చారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎర్రమఠం గ్రామంలో డెంగీ నివారణ మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ డెంగీ వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. అధిక జ్వరం, దద్దుర్లు, తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, అలసట, వాంతులు తదితర లక్షణాలుంటాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ వుండకుండా చూసుకోవాలని సూచించారు


యూనిఫామ్ సివిల్‌కోడ్‌ను రద్దు చేయాలి



సంతకాల సేకరణ చేస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

పాములపాడు: భారత దేశ సంస్కృతి సాంప్రదాయాలను కాలరాసే యూనిఫామ్‌సివిల్ కోడ్‌ను రద్దు దచేయాలని డిమాండ్‌తో శనివారం మండల కేంద్రంలో ముస్లింలు సంతకాల సేకరణ చేపట్టారు. అలాగే ప్రజా సంఘాల నాయకులు కేజీ రోడ్డుపై రాస్తారోకో చేశారు. ముస్లిం మైనార్టీ నాయకులు మహబూబ్‌బాషా మట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం మరలా ఓ కొత్త నల్ల చట్టాన్ని తీసుకొని రావడానికి ప్రయత్నిస్తోందన్నారు. ప్రజలందరూ నల్ల చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆన్‌లైన్‌లో తమ అభిప్రాయాలను పంపాలన్నారు. కార్యక్రమాల్లో ముస్లిం మైనార్టీ నాయకులు ఖాసీం, ప్రజా సంఘాల నాయకులు షర్ఫుద్దీన్‌అలీ, స్వాములు, గాలిగౌడు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు సాధారణం



ఉద్యోగులను సన్మానించిన వైద్యాధికారి వెంకటరమణ, సిబ్బంది

ఆత్మకూరు: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి వెంకటరమణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న నారాయణ రావు , ప్రవీణ, రోజమ్మ, మహేష్ బాబు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శనివారం వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది నాగరాజు, జుబేదా బేగం, అనుపమ, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు వైఎస్సార్

- నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- ఘనంగా వైఎస్సార్ జయంతి, రైతు దినోత్సవం



వైఎస్సార్ స్మృతి వనంలో వైఎస్సార్‌విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్, ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, పార్టీ నాయకులు

ఆత్మకూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతులకు అండగా నిలచి వారి కన్నీళ్లు తుడిచి రైతు బాంధవుడిగా నిలిచారని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. వైఎస్సార్ స్మృతి వనంలో శనివారం జననేత వైఎస్సార్ 74 వ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైఎస్సార్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు సయ్యద్‌మీర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి పార్టీ నాయకులుకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంల్లో ముఖ్యమంత్రిగా రైతులు, రైతు కూలీలు, విద్యార్థులు, ఉద్యోగులు, ఇలా అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసి జనహృదయాల్లో చిరిస్థాయిగా నిలిచిన నేత వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన బాటలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ సీఎం అమలు చేయని సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలతో పాటూ ఎన్నో హామీలను నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. రైతన్న శ్రేయస్సు కోసం వైఎస్సార్ రైతు దినోత్సవాన్ని నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. రైతు భరోసా, పంటకు గిట్టుబాటు ధర, రైతు భరోసా కేంద్రాలతో పాటు నేడు రాష్ట్రంలో వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి పాటుపడుతున్నారని చెప్పారు.

ఆత్మకూరు పట్టణంలో

పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్‌మీర్‌లు పాలాభిషేకం చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. అంతకుమునుపు వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం నుంచి కొత్తబస్టాండ్, గౌడ్‌సెంటర్, రఘునాథ్ థియేటర్ మీదుగా నంద్యాల టర్నింగ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. నంద్యాల టర్నింగ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి స్మృతి వనం వరకు ర్యాలీ కొనసాగించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు రషీద్, పువ్వాడ భాస్కర్, కౌన్సిలర్లు విజయచౌదరి, విజయ్, కలిముల్లా, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరులో సేవా కార్యక్రమాలు

నందికొట్కూరు : పట్టణంలోని కర్నూలు రహదారిలో, పాతబస్టాండ్, కోటవీధిలో, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో బ్రెడ్లు, పండ్లు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో వైఎస్సార్ చిత్ర పటానికి, పాతబస్టాండ్ లోని వైఎస్సార్ విగ్రహానికి చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు హరిస్వరోత్తమరెడ్డి, హుసేనయ్య, వైస్ చైర్మన్లు రబ్బానీ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



పాములపాడులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, నాయకులు



వైఎస్సార్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు

పాములపాడు: మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పాలాభిషేకం చేసి, పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ చౌడయ్య, అంబయ్య, మధుసూదనరావు, రమణారెడ్డి, బాలీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: స్థానిక సంతగేటు ఆవరణలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి స్మరించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గుండ్రెడ్డి భాస్కర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జంగాలపెద్దన్న, కిరణ్‌కుమార్‌రెడ్డి, దేవసహాయం పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు వైఎస్సార్



పగిడ్యాల బస్టాండులో కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి



కరివేనలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ మాణిక్యమ్మ, కొండలరావు



వెలుగోడులో మహానేత విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పగిడ్యాల: పేదల గుండె చప్పుడు వైఎస్సార్ అని జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, పార్టీ మండల కన్వీనర్ జి. రమేష్‌నాయుడు అన్నారు. వైఎస్సార్ జయంతిని పుస్కరించుకుని శనివారం మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించారు. పడమర ప్రాతకోట, నెహ్రూనగర్, లక్ష్మాపురం, పగిడ్యాల గ్రామాల్లో నెలకొల్పిన వైఎస్సార్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నెహ్రూనగర్ సర్పంచ్ కూరాకుల రాజేశ్వరి ఆధ్వర్యంలో మండలంలోని పది రైతు భరోసా కేంద్రాల వద్ద వైఎస్సార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బోరెల్లి శ్యామలమ్మ, పల్లె అరుణమ్మ, ఎంపీటీసీలు పగడం గోపాల్, మిద్దె స్వాములు, ప్రియాంక, చంద్రమోహన్‌నాయుడు, కళావతి, కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం

ఆత్మకూరు: పట్టణంలో, పలు గ్రామాల్లో వైఎస్సార్ జయంతి సందర్భంగా శనివారం రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రైతు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఏడీఏ ఆంజనేయులు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మ న్ కొండలరావు, షేక్‌కార్పొరేషన్ డైరెక్టర్ అంజాద్‌అలీ, రైతు భరోసా కేంద్రం చైర్మన్ బైరాపురం షేక్‌మహబూబ్‌బాషా, కరివేన సర్పంచ్ మాణిక్యమ్మ పాల్గొన్నారు.

వెలుగోడు: పట్టణంలోని చౌడమ్మ దేవాలయం, మదిన సెంటర్లోని దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైఎస్సార్ సీపీ నేతలు పాలాభిషేకం చేసి పూలమాలతో ఘనం నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్ వైఎస్సార్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల జెసీఎస్ కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, మండల కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీలు నసిరుద్దీన్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



కేక్‌కట్ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

మిడుతూరు: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివగంత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ పర్వత యుగంధర్ రెడ్డి, సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అవరణలో వైఎస్సార్ జయంతి , రైతు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వైస్ ఎంపీపీ నబీరసూల్, ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ మౌలాలి, ఎంపీటీసీ హరిసర్వోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో వైఎస్సార్ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, కో-ఆప్టెడ్ సభ్యుడు మహమ్మద్ గౌస్, సర్పంచులు విజయ్‌కుమార్, బాల ఎల్లయ్య, ఎంపీటీసీ శివన్న తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. నాగంపల్లి గ్రామంలో మద్దిలేటియాదవ్, ఉపసర్పంచు కరిముల్లా, కొక్కెరంచ గ్రామంలో జగదీష్ గౌడ్, దాసన్నలు, దుద్యాల గ్రామంలో కోటేశ్వరరెడ్డి, ఉస్మాన్, ఏ.ముర్తుజా, యుగంధర్ రెడ్డి,లు వైఎస్సార్ విగ్రహనికి పాలాభిషేకాలు చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైఎస్ విగ్రహానికి పాలాభిషేకం



అల్లూరులో వైఎస్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్ : దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 74వ జయంతి సందర్భంగా మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రవీంద్ర నాయుడులు గ్రామ నాయకులతో కలిసి వైఎస్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాండ్ర వేదవతమ్మ, సుమంత్‌రెడ్డి, పాపన్న, శేఖర్, కుమ్మరి శేషన్న తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్ : పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి,ఆధ్వర్యంలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఓంకార్‌రెడ్డి, సర్పంచ్ జనార్దన్‌గౌడు, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, పబ్బతి రవి, వెంకటేశ్వర్లు, ఉపేంద్రరెడ్డి, అమర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి

శ్రీశైలంప్రాజెక్ట్: దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీగా తరలివచ్చారు. అక్కడ ఉన్న మహానేత విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ నాయకులు జింకా గుండయ్య యాదవ్, నాయకులు భరత్‌రెడ్డి, ఆసాది ప్రవీణ్ దివ్యతేజ, పాపారావు, గౌస్‌మొహిద్దీన్, బక్కన్న పాల్గొన్నారు.



నందికొట్కూరు ఎంపీపీ కార్యాలయంలో వైఎస్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ, మండల నాయకులు



సున్నిపెంట బస్టాండ్‌సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

జూపాడుబంగ్లాలో



జూపాడుబంగ్లాలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు

జూపాడుబంగా: మండల కేంద్రంలోని సంతగేటు వద్ద వున్న వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల చైర్మన్ నాగార్జునరెడ్డి తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోసిక తిరుమలేశ్‌రెడ్డి, తరుణ్‌కుమార్‌రెడ్డి, మద్దిలేటిరెడ్డి, తర్తూరు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహానంది మండలం బుక్కాపురం వద్ద వైఎస్సార్ జయంతి వేడుకలు

ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

మహానంది: మహానంది మండలం బుక్కాపురంలోని రైతు భరోసా కేంద్రం వద్ద వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేకు కట్ చేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ, సర్పంచు కందుల వరలక్ష్మమ్మ, ఈశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ యర్రగుంట్ల పెద్ద వెంకట్రాముడు, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, సర్పంచ్ సుదర్శనం తదితరులు పాల్గొన్నారు. గోపవరం సమీపంలోని సెయింట్‌ఆన్స్ మానసిక వికలాంగుల సేవా కేంద్రంలో మాజీ ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసులు, నాయకులు బండి చంద్రపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

మహానేత సేవలు మరువలేనివి

మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివని బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి అన్నారు. బండిఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముడిమెల పుల్లారెడ్డి, ఉప సర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బండిఆత్మకూరు మండలం లింగాపురం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో పంటపొలాల్లో ఉపాధి కూలీలు వైఎస్సార్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.



బండిఆత్మకూరులో వైఎస్సార్ జయంతి వేడుకల్లో ఎంపీపీ, నాయకులు

పంచ్‌ప్రభాకర్‌రెడ్డిని శిక్షించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: సోషల్ మీడియా వేదికగా పంచ్ ప్రభాకర్‌రెడ్డి దళిత, గిరిజనులను ఉద్దేశించి పరుష పదజాలంతో మాట్లాడడాన్ని నిరసిస్తూ శనివారం పలు ప్రజా సంఘాలు, దళిత, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో సున్నిపెంటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. దళితులు, గిరిజనుల పట్ల, వారి కులాలను ఎత్తి చూపుతూ బూతులు మాట్లాడడం సరికాదన్నారు. తీవ్రంగా దళిత గిరిజనుల పట్ల వ్యాఖ్యలు చేసిన పంచ్‌ప్రభాకర్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు వై.ఆశీర్వాదం, మల్లికార్జున, ఎమ్మార్పీఎస్ నాయకులు నాగెల్ల సురేష్, దానియేలు, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా, దళిత, గిరిజన సంఘాల నాయకులు

కడమలకాల్వలో అతిసార నివారణకు పటిష్టచర్యలు



బాధితుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమల కాల్వ గ్రామంలో అతిసారం నివారణ కోసం పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. గ్రామంలో మరోసారి అతిసారం పెరగడంతో శనివారం ఆయన గ్రామానికి చేరుకొని రైతుభరోసా కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని పరీక్షించారు. ఆహారం, నీరు కలుషితం అవడం వల్లే అతిసారం ఎక్కువవుతుందన్నారు. గ్రామస్తులు తాగునీరు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, నీరు వడకాచి చల్లార్చి తాగాలని సూచించారు. అలాగే పారిశుధ్యపనులపై మండల పరిషత్ అధికారులతో మాట్లాడారు.

సెంచరీ దాటిన టమాట, పచ్చిమిర్చి

జూపాడుబంగ్లా: శనివారం జరిగిన 80బన్నూరు వారాంతపు సంతలో టమాటాలు, పచ్చిమిర్చి ధరలు సెంచరీ దాటడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిలో టమోటా రూ.120, కిలో పచ్చిమిర్చి రూ.120 పలకటంతో కిలో కొనుగోలు చేసే వినియోగదారులు పావుకిలోతో సరిపెట్టుకున్నారు. ధరలు అధికంగా ఉండటంతో టమాటాలు, పచ్చిమిర్చి విక్రయాలు తగ్గిపోయాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు తప్పనిసరైన పరిస్థితుల్లో పావుకిలో, అరకిలోతో సరిపెట్టుకొంటుండగా ఆర్థికంగా ఉన్నవారు మాత్రమే కిలో చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు. టమోటా, పచ్చిమిర్చిల ధరలు అధికంగా ఉండటంతో వాటికి ప్రత్యామ్నాయంగా వినియోగదారులు చింతపండు, ఒట్టికారంతో సరిపెట్టుకుంటున్నారు. వీటితో పాటు మిగిలిన కూరగాయలైన బెండకాయ, కాకరకాయ, బీర, చిక్కుడు బుడ్డల ధరలు కిలో రూ.60లు పలకగా క్యారెట్, క్యాప్సికం కిలో రూ.80లు పలికాయి. అధిక ధరలు వెచ్చించి కూరగాయలు కొనుగోలు చేయలేం ధరలు తగ్గేవరకు పప్పుతో సరిపెట్టుకొంటాదమని తక్కువ ధరలున్న కూరగాయలు అరకొరగా కొనుగోలు చేసుకొని వెళ్తున్నారు.



సంతలో కూరగాయలు కొంటున్న వినియోగదారులు

జనం గుండెల్లో చెరగని ముద్ర వైఎస్సార్



వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే,



రైతులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

నందికొట్కూరు రూరల్ : జనాల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహనీయుడు డాక్టర్ వైఎస్‌రాజశేఖరరెడ్డి అని ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ అన్నారు. శనివారం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని వైఎస్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నందికొట్కూరు పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద డాక్టర్ వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతును రాజుగా చేసిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గారికే దక్కుతుందన్నారు. అనంతరం రైతులకు రూ.10.37 కోట్ల పంటల బీమా చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు, రబ్బాని, ప్రశాంతి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో వీకెండ్ సందడి



మహానంది: మహానందిలో శనివారం వీకెండ్ సందడి నెలకొంది. సెలవురోజులు ఉండటంతో రెండు తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా తమినాడు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు దర్శనం నిర్విరామంగా కొనసాగింది. ఆర్జితసేవా టికెట్లు, అభిషేకాలు, ప్రసాదాల విక్రయం, వసతిగృహాలు తదితర విభాగాల ద్వారా ఒకేరోజు ఆలయానికి సుమారు రూ. 5లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి దంపతులకు రాత్రి ఏకాంతసేవ పూజలు నిర్వహించారు. మహానందిలో నంద్యాలకు చెందిన ఆధ్యాత్మిక ప్రవచకులు దివి హయగ్రీవాచార్యులు ఆధ్వర్యంలో రెండో రోజు విరాటపర్వం పారాయణం చేశారు. పారాయణం ద్వారా వర్షాలు బాగా కురుస్తాయని వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకం

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల-పారుమంచాల గ్రామాల మధ్యన తూడిచెర్ల మిట్టల వద్ద ప్రభుత్వభూమిలో అక్రమంగా మట్టిని తవ్వి యథేచ్ఛగా విక్రయించి సొమ్ముచేసుకొంటున్నా పట్టించుకొనేనాథుడే కరువయ్యారు. తూడిచెర్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రోడ్డు పక్కన ప్రభుత్వ అసైన్డ్ భూమిని కొనుగోలు చేశాడు. అందులోని మట్టిని తవ్వి టిప్పర్ మట్టి రూ.5వేల నుంచి రూ.10వేలు, ట్రాక్టర్ మట్టి రూ.2వేల నుంచి రూ.4వేల దాకా విక్రయించి సొమ్ముచేసుకొంటున్నాడు. వాస్తవానికి ప్రభుత్వ అసైన్డ్‌భూమిని అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరం. దీనికితోడు అందులోని మట్టిని తవ్వి యథేచ్ఛగా విక్రయిస్తున్నా రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు ఎవ్వరూ పట్టించుకోకపోవటంతో సదరు వ్యక్తి ప్రొక్లెయిన్‌తో మట్టిని తవ్వి యథేచ్ఛగా విక్రయిస్తున్నాడు. అధికారులు ఇప్పటికైనా మట్టితవ్వకాలు జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించి అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రొక్లెయిన్‌తో మట్టిని తవ్వుతున్న దృశ్యం

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

తూడిచెర్ల మిట్టలపై ప్రభుత్వ అసైన్డ్‌భూమిలో అక్రమంగా మట్టిని తవ్వి విక్రయిస్తున్న విషయమై తహసీల్దార్ పుల్లయ్యయాదవ్‌ను వివరణ కోరగా తామెవ్వరికీ మట్టితవ్వకాలను అనుమతిని ఇవ్వలేదన్నారు. అక్రమంగా మట్టిని తవ్వుతున్న ప్రాంతాన్ని పరిశీలించి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం.